క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్సైని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వీణవంక: వీణవంక ఎస్సైగా వంశీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఆసిఫ్‌ను వీఆర్‌కు పంపగా ఆయన స్థానంలో వంశీకృష్ణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే డయల్ 100కి ఫిర్యాదు చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, మ్యాక సమ్మయ్య, మాజీ జెడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, కాసర్ల సుధాకర్, పెద్దపల్లి సత్యనారాయణ, సంపత్, అశోక్ తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్ సీఐగా స్వామి

తిమ్మాపూర్: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.స్వామిని నియమిస్తూ మల్టీజోన్ వన్ ఐజీ తరుణ్ జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఎస్ ట్రాన్స్ కోలో పనిచేస్తున్న స్వామి బుధవారం ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయగా ఆయనను తిమ్మాపూర్ సీఐగా నియమిస్తూ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

నియామకం



సన్మానిస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ మాజీ సర్పంచ్ గట్టు తిరుపతిగౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో తిరుపతిగౌడ్‌ను మండల అధ్యక్షుడు బసవయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. ఈకార్యక్రమంలో మల్లారెడ్డి, తిరుపతి, రాజయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారం నమ్మొద్దు'



కౌన్సిలింగ్ ఇస్తున్న గంగిశెట్టి రాజు

హుజూరాబాద్‌రూరల్: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తరఫున నిధుల సేకరణ చేపడుతున్నామంటూ కొంతమంది చేస్తున్న ప్రచారం నమ్మొద్దని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు కోరారు. అయోధ్యకు వెళ్తున్నాం ఆర్థిక సాయం చేయాలని మీ తరఫున అక్కడ అన్నదానం చేయిస్తామని డబ్బులు వసూలు చేస్తున్న కొంతమందిని పట్టుకొని పోలీసుల సమక్షంలో బుధవారం కౌన్సిలింగ్ ఇప్పించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఎక్కడ నిధులు వసూలు చేయటం లేదని ఇలాంటి వారి మాటలతో మోసపోవద్దన్నారు.

ఒకరిపై కేసు

జమ్మికుంట: కారుతో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. గత డిసెంబర్ 26న ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన రాపాల అనిల్‌కుమార్ రాత్రి జమ్మికుంట పట్టణానికి బైక్‌పై వస్తుండగా కోరపల్లి రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై వారం రోజులు చికిత్స పొందిన తర్వాత బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

పరామర్శ



మధుకర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు అధ్యక్షుడు గంట మధుకర్ కుటుంబాన్ని బుధవారం సామాజికవేత్త, హెచ్‌సీఎల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ సబ్బని వెంకట్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక శ్రీనివాస్, గందె శ్రీనివాస్, అనిల్ యాదవ్ పరామర్శించారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా మధుకర్ కాలి రెండు వేళ్లను తొలగించారు, అలాగే ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు, పార్టీ పరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు.

యాసంగిపైనే రైతుల ఆశలు

- కరుణించని వానాకాలం సాగు
- తెగులు సోకి దెబ్బతిన్న వరి
- ఆశించినస్థాయిలోరాని దిగుబడి



గంగాధరలో వరినాట్లు వేస్తున్న మహిళలు

గంగాధర: ఆరుగాలం శ్రమించిన రైతాంగానికి ఖరీఫ్‌లో వరిసాగు కలిసిరాలేదు. తెగులు సోకి దిగుబడి తగ్గి చాలా మంది రైతులకు పెట్టుబడి రాలేదు. కనీసం యాసంగిలోనైనా కాలం కరుణించి దిగుబడి పెరుగుతుందని రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. వానాకాలంలో మండలంలోని చెరువులు, కుంటలు నిండటంతో పాటు వరదకాలువలో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో 19,470 ఎకరాల్లో రైతులు వరి, 4,135 ఎకరాల్లో పత్తి సాగు చేశారు.

తగ్గిన దిగుబడి....

ఖరీఫ్‌లో వరిసాగు పెరిగినా దిగుబడి గణనీయంగా తగ్గింది. 19 వేల ఎకరాలకు మించి వరిసాగు చేస్తే దాదాపు 5.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం పరిశీలిస్తే దిగుబడి భారీగా తగ్గింది. ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా 58,900, గంగాధర సహకార సంఘం ద్వారా 1,04,311, కురిక్యాల సహకార సంఘం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 90 వేలు, ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు చేస్తే మొత్తం నాలుగు లక్షల క్వింటాళ్ల దిగుబడి దాటలేదు. వరిలో తెగులు సోకని రైతులకు ఎకరాకు 30 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చింది. తెగులు సోకిన రైతులు కొందరు పూర్తిగా నష్టపోతే మరికొంతమంది రైతులకు ఎకరాకు పది నుంచి పదిహేను క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది.

యాసంగిపైనే ఆశలు..

ఖరీఫ్‌లో దిగుబడి తగ్గి నష్టపోయిన రైతులు యాసంగిపై ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా ఖరీఫ్‌కంటే యాసంగిలో వరి ఐదారు క్వింటాళ్ల ఎక్కువగా వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఆలస్యంగా సాగు చేసి ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతాంగం యాసంగిలో ముందస్తుగా వరినాట్లు వేస్తున్నారు.

యాసంగైనా కలిసత్తదో..



వానాకాలంలో ఐదెకరాల్లో వరి సాగు చేశాను. ముందుగా వేసిన రెండెకరాల్లో దిగుబడి బాగానే వచ్చింది. ఆలస్యంగా వేసిన మూడెకరాలకు తెగులు సోకింది. మందులు కొట్టినా పంట దక్కలేదు. చేను కోయకుండానే వదిలేశాను. కనీసం యేసంగైనా కలిసత్తదనే ఆశతో మళ్లీ నాట్లు వేస్తున్నా.

– మడుపు గంగారెడ్డి, కురిక్యాల, రైతు

పెట్టుబడి రాలేదు



వానాకాలంలో ఐదెకరాల్లో వరి సాగుచేస్తే నాలుగెకరాలకు తెగులు సోకి పంట దెబ్బతిన్నది. ఎకరాకు రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట గొల వేసే దశలో పురుగు సోకింది. మందులు పిచికారీ చేసినా ఫలితంలేదు. సగానికి పైగా ఊస పోయింది. పెట్టుబడి రాలేదు. యేసంగిపైనే ఆశలు పెట్టుకున్నా.

– పురుషోత్తం, రైతు గోపాల్‌రావుపల్లి

గోవధను నిరసిస్తూ బీజేపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో గోవధ ఘటనకు నిరసనగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గోవధకు పాల్పడిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రహదారిపై భారీసంఖ్యలో వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకో, ధర్నాను విరమింపజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, సొల్లు అజయ్‌వర్మ, మాడ వెంకటరెడ్డి, నరేందర్, కొముర‌య్య, రాజిరెడ్డి, గిరిధర్, జగ్గారెడ్డి, సారయ్య, వీరార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులపై కేసు

మండల కేంద్రంలో రాస్తారోకో, ధర్నా చేపట్టి ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసిన బీజేపీ నాయకులపై కేసునమోదు చేశామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

ఆలయానికి రూ. 51 వేల విరాళం



విరాళం అందిస్తున్న భక్తుడు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయానికి చొప్పదండికి చెందిన చల్ల లత,మల్లేశం దంపతులు బుధవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.51 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఉప్పుల గణేశ్, పిట్టల మల్లేశం, గోవులకొండ ఆంజనేయులు, కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, గుర్రం సమ్మిరెడ్డి, ఎలిగేటి రాములు, సాయి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇబ్బంది కలగొద్దు

- ప్రజాపాలన కేంద్రాల వద్ద కనీస ఏర్పాట్లు చేపట్టాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా కనీస ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని వెంకట్రావ్ పల్లి, సిర్సపల్లి గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని 14, 24 వార్డులలో నిర్వహించిన ప్రజాపాలన కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుదారుల టెంట్, మంచినీరు, కుర్చీల వంటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వయోవృద్ధులు, వికలాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని. రేషన్ కార్డు కోసం తెల్లకాగితంపై ఇచ్చే దరఖాస్తులతో పాటు ఇతర దరఖాస్తుల స్వీకరణ 6వ తేదీ వరకు కొనసాగాలని, అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, కమిషనర్ సమ్మయ్య, ప్రత్యేకాధికారి పద్మావతి తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి అన్నారు. సిర్సపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు.

అవగాహన కార్యక్రమం

జమ్మికుంట: పట్టణంలోని 30 వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ పర్యవేక్షించారు. మండలంలోని వావిలాల, తనుగుల,విలాసాగర్, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో ఆరుగ్యారంటీలపై తహసీల్దార్ రజిని, ఎంపీడీవో కల్పన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వావిలాలలో దరఖాస్తుల స్వీకరణలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పాల్గొన్నారు. అనంతరం వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ప్రతీ పథకం అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు సదానందం, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

దరఖాస్తుల తనిఖీ

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. పొరపాట్లకు తావివ్వొద్దని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఉప సర్పంచ్ ఎంపీటీసీ పద్మ, మండల ప్రత్యేక అధికారి జయశంకర్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీఓ కిరణ్ కుమార్ ఏఈ, సీఆర్పీ, ఏపీఎం, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, జీపీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు..

మానకొండూర్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తులను తిరస్కరించకూడదని కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. లక్ష్మీపూర్, లింగాపూర్, ముంజంపల్లి, మద్దికుంట గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాజు,ఎంపీఓ రాజేశ్వర్‌రావు, ఆర్‌ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంది

చిగురుమామిడి: ప్రజాపాలన సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. రేకొండ, రామంచ, సీతారాంపూర్ గ్రామాల ప్రజాపాలనలో జెడ్పీటీసీ గీకురు రవీందర్ పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని జెడ్పీటీసీ అన్నారు. ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ నరేందర్, ఏఓ రంజిత్‌రెడ్డి, సర్పంచులు రజిత, మాధవి, బాపురెడ్డి, ఎంపీటీసీలు సంధ్య, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాపాలన సద్వినియోగం చేసుకోవాలి


చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: ప్రజాపాలనను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. మండలంలోని వెదురుగట్టలో ప్రజాపాలనలో పాల్గొన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ రవీందర్, ఎంపీడీవో స్వరూప, నారాయణరావు, తదితరులున్నారు.

గంగాధర: ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని ఎమ్మెల్యే అన్నారు. మధురానగర్, మల్లాపూర్ గ్రామాలలో ప్రజాపాలన సమావేశాల్లో మాట్లాడారు. ఆరింటిలో రెండు గ్యారంటీలు అమలు చేశామన్నారు. త్వరలో రెండు వందల యూనిట్ల విద్యుత్ వినియోగించే గృహాలకు జీరో బిల్లు వస్తుందన్నారు. సర్పంచులు లావణ్య, శంకరయ్య, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామడుగు: పేదల సంక్షేమం ధ్యేయంగా చేపట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మండలంలోని కోరటపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. మండలంలోని లక్ష్మీపూర్, మోతె, పందికుంటపల్లి గ్రామాలలో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ లెంకల శ్రీలతారెడ్డి, ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్, మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ భాస్కర్, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, సర్పంచ్ మన్నె దర్శన్‌రావు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి మనీషా

విద్యానగర్: మానసిక ప్రశాంతతతోనే మనుషులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కరీంనగర్ శాఖ బాధ్యురాలు బ్రహ్మకుమారి బీకే మనీషా అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం ప్రెస్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కరీంనగర్ శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శారీరక శ్రమ నుంచి ఉపశమనం పొందాలంటే మానసిక ప్రశాంతత ముఖ్యమని, అది మెడిటేషన్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. పాత్రికేయ వృత్తిలోనివారు అనేక ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించాల్సి ఉంటుందని, అలాంటివారికి మెడిటేషన్ ద్వారానే సాంత్వన చేకూరుతుందని తెలిపారు. కరీంనగర్‌లో తాము నిర్వహిస్తున్న కేంద్రాల్లో నిత్యం మెడిటేషన్ చేసే అవకాశం లభిస్తుందని, జర్నలిస్టులు వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కరుణాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయసింహారావు, పి.ప్రభుదాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



జమ్మికుంట: సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సావిత్రిబాయిపూలే జయంతి

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాసనగర్ కేజీబీవీ, పచ్చునూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ..ఆడపిల్లల చదువు కోసం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. మహిళల అభ్యున్నతి, విద్యకు అవిశ్రాంతంగా కృషిచేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలని పేర్కొన్నారు. పచ్చునూర్ పాఠశాలలో మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని జ్యోతిరావు పూలే చౌరస్తా దగ్గర సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బొరగాల తిరుమల, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేరీ స్వరూపరాణిని సన్మానించారు. కార్యక్రమంలో పూలే జయంతి కమిటీ గౌరవ అధ్యక్షులు ఎండీ ఖాలీద్ హుస్సేన్, అధ్యక్షుడు బుర్ర కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉప్పు శ్రీనివాస్, నాయకులు, అంబేద్కర్ జయంతి కమిటీ గౌరవ అధ్యక్షుడు రత్నం, బీఆర్‌ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పుష్పలత, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. మానవ వికాస వేదిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి రాష్ట్ర నాయకుడు దొడ్డె సమ్మయ్య, రాష్ట్ర యూత్ విభాగం నాయకులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని గ్రంథాలయంలో జయంతి నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాల టీచర్ నాగమణి సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, పీడిత ప్రజలు,స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశారని ఆమె సేవలను కొనియాడారు. ఐక్యూ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవీందర్, రవి, అధ్యాపకులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ రామ్మోహన్‌రావు, డాక్టర్ సువర్ణ, ఈశ్వరయ్య, మమత, సుష్మ, రవిప్రకాష్, సుధాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీఎస్పీఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.



హుజూరాబాద్: సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గందె రాధిక, నాయకులు

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

చిగురుమామిడి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు రోడ్డునపడ్డారని, ప్రభుత్వం ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు తాల్ల నరేశ్ కోరారు. బుధవారం తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులను ఉచిత ప్రయాణానికి మినహాయించాలని, కేవలం తెల్లరేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. అలాగే ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.నాలుగు వేల జీవనభృతిని అందించాలన్నారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లెల్ల సురేశ్, అందె సాగర్, కొంకట హరీశ్, రాజ్‌కుమార్, గణేశ్ తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేశ్

ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలి

విద్యానగర్(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్‌లో నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి కోరారు. బుధవారం ఆయన స్థానికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. పెళ్లిళ్ల సమయంలో డబ్బుల నియంత్రణతో తల్లిదండ్రులు, అటు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. వచ్చేనెలలో శుభమూహుర్తాలు ఉన్నాయని.. పెళ్లిళ్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో బతుకులు రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బీఆర్టీయూ అనుబంధ సంఘమైన కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తెలంగాణ చౌక్ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి నరసింహ, సంపత్, అంతగిరి సంపత్, ఆటో యూనియన్ నాయకులు గొర్రె రవి, సంపత్, మల్లేశం, వంద మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ సర్పంచ్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పడాల శంకరయ్య ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను బుధవారం కలిసి సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ, మండల సమస్యలపై మాట్లాడారు.

పోస్టల్ వడ్డీరేట్ల పెంపు

విద్యానగర్(కరీంనగర్): తపాలాశాఖ వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుందని.. ఈనెల నుంచి మార్చి 31 వరకు కొత్త వడ్డీ రేట్లు వర్తిస్తాయని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ తెలిపారు. బుధవారం స్థానికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. పెరిగిన వడ్డీ రేట్ల ప్రకారం సేవింగ్స్ డిపాజిట్‌పై 4.0 శాతం, ఏడాది టైమ్ డిపాజిట్‌పై 6.9, రెండు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.0, మూడు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.1, ఐదు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.5, ఐదు సంవత్సరాల రికరింగ్ డిపాజిట్‌పై 6.7, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌పై 8.2, నెలవారీ ఆదాయ ఖాతా పథకంపై 7.4, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్‌పై 7.7, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకంపై 7.1, సుకన్య సమృద్ధి ఖాతా పథకంపై 8.2 శాతం వడ్డీ పెంచినట్లు వివరించారు.

● **విద్యార్థులపై దాడిచేసిన వారిపై కేసు**

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రాంనగర్‌లో జరిగిన ఒక గొడవ విషయంలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ ఎస్సై రాజన్న తెలిపారు. రాంనగర్ ఎస్సీ హాస్టల్‌లో గత నెల 31న విద్యార్థులు, బయటి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. పాత గొడవను దృష్టిలో ఉంచుకొని మంగళవారం రాత్రి 11.30 గంటలకు తిరిగి సాయిరాం, నాగరాజు, అరుణ్, సిద్ధార్థ, మధు, రవిప్రసాద్, శ్రీధర్, ఈశ్వర్, పవన్ రాంనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి వేల్పుల మధుతో పాటు ఇతర విద్యార్థులపై కట్టెలు, రాళ్లతో దాడిచేశారు. వాచ్‌మన్ గూడూరి సతీశ్ అడ్డురాగా ఆయనపై దాడిచేశారు. ఘటనపై వేల్పుల మధు ఫిర్యాదు చేయగా తొమ్మిది మందిపై కేసు ఫైల్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

● **సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన**

కరీంనగర్‌క్రైం: సైబర్ జాగృత దివస్‌లో భాగంగా నగరంలోని సహస్ర జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సునీల్ సైబర్ మోసాలు, హ్యాకింగ్, ఓటీపీలు చెప్పడం ద్వారా జరిగే మోసాలు ఎలా అరికట్టాలో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వసీం, వెంకటేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.